

**ప్రేమానుబంధాలు ఖరీదుకు మాత్రమే దొరికే బతుకుల్లో
ఆ హిపోక్రటిక్ ముసుగు తొలగించి చూసిన వ్యక్తికి అవన్నీ భిన్నంగా
కనిపించవచ్చు. ఇతను నిస్సంగత్వాన్ని సాధన చేస్తున్నవాడు.
ఆ నిస్సంగత్వం అందరిలో కనిపించదు. ఈ 'వితండం మామ'
మన మిత్రుల్లోనో, బంధువుల్లోనో తప్పకుండా ఒకడుంటాడు.**

మునిసురేష్ పిళ్లె

# 1 వితండం మామ

చారి పి.ఎస్.





నగరంలో పాడె కట్టేవాడికి చాలా డిమాండు. ఏడెనిమిది అడుగులుండే నిలువు వెదురుబొంగులు రెండు, వాటికి అడ్డాలుగా వేయాల్సిన వెదురుబద్దలు డజనున్నర, పురికోసు దారాల కట్టలు రెండు, రెండు పిడికిళ్ల ఎండుగడ్డి, నాలుగైదు టెంకాయలు, పంచె, తువ్వాలు... శవం మీద కప్పడానికి, బద్ది చేసుకోడానికి ఓ తెల్లగుడ్డ, రెండుకుండలు, రెండు పూలమాలలు, కాసిని విడిపూలు, పూల రేకులు, బొరుగులు, బొగ్గులు, సాంబ్రాణి, అగరొత్తులు ఎట్సెట్రా... ఎట్సెట్రా... ఇవన్నీ కలిపి టోకుగా ముప్పయ్యారు వేలవుతుందని లెక్కచెప్పాడు వాడు. పదివేలకంటె ఎక్కువ కాదన్నాడు బావ.

వాడు అదో మాదిరిగా నవ్వి... "నిజమే సార్... రోజూ నాకు బేరం ఇస్తారా చెప్పండి... మీరన్నట్లు పదివేలకే చేస్తా," అన్నాడు.

ఈ బేరం కోసం- ప్రతిరోజూ ఎవరు చావగలం ఈ ఇంట్లో... అని సరిపెట్టుకుని ఒప్పేసుకున్నారు.

పోయింది... బావకు పెదమేనత్త. ముందూవెనుకా ఎవరూ లేకపోవడం వలన అన్నీ బావే చేశాడు. తీరా పాడె లేపాల్సిన వేళకి ఓ భుజం తక్కువ పడింది. అటూ ఇటూ తేరిచూసి బావ, పాడె కాంట్రాక్టరునే ఓ చెయ్యి వేయమన్నాడు. వాడు చిత్రంగా ఓ నవ్వు నవ్వి, 'నా పని ఇంతవరకే సార్... కావాలంటే చెప్పండి...' అంటూ, మరో కాంట్రాక్టుకు సంకేతం ఇచ్చాడు. ఈలోగా, 'గోవిందా అంటూ ఎత్తండ్రా,' అనే పొలికేకతో పాడె ముందువైపు బొంగు పట్టుకుని నిల్చున్నాడు. ఎప్పుడొచ్చాడోగానీ... వీరామామ!

ఆమె ఆఖరియాత్ర మొదలైంది.

స్మశానంలోకి వెళ్లాక... దింపుడు కళ్లెం అంటూ పాడె దించారు. అలవాటు కొద్దీ పేరుపెట్టి మూడుసార్లు అత్త చెవిలో పిలిచాడు బావ. ఆనక తీసుకెళ్లి కాష్టం మీద పడుకోబెట్టారు. భుజాన నీళ్లకుండ ఎలా పట్టుకోవాలో కూడా తెలియకుండా... జారిపోతున్న పంచెని ఓ చేత్తో సర్దుకుంటూ... బావ కాష్టం చుట్టూ తిరుగుతున్నాడు.

దూరంగా ఓ చెట్టుకింద సమాధి మీద కూర్చుని ఉన్నాడు వీరామామ. నేను దగ్గరికెళ్లేసరికి... ఓ కొబ్బరిముక్క అందించాడు.

చేయి చాచబోయి ఉలిక్కిపడ్డాన్నేను. దింపుడు కళ్లేనికి దించినప్పుడు పాడె దగ్గర కొట్టిన టెంకాయ అది. ఓ చిప్ప తెచ్చుకుని సమాధిమీద గచ్చుపై కొట్టుకుని తింటున్నాడు మామ. వీరామామను మావాళ్లలో కొందరు 'వితండంగాడు' అని ముద్దుగా ఎందుకంటారో అప్పుడు అర్థమైంది నాకు.

అత్తకు కపాల మోక్షం జరిగిపోయి అందరం ఇంటికొచ్చినాక... మెస్ నుంచి భోజనాలు వచ్చేదాకా కూడా మామయ్య ఆగలేదు. 'పాడె మోస్తివే... పాలనాటికి ఉండాల్సిందే.. భుజాల్ని పాలతో తడుపుకోవాల,' అని బావ హెచ్చరిస్తే... 'మీ అత్త తిరిగొచ్చి నన్ను మింగేయదులేరా,' అని నవ్వేసాడు. 'రాత్రి రైలుకి ప్రీమియం తత్కాల్లో రిజర్వు చేస్తా మామా,' అని అక్క వారిస్తే... 'మీ సిటీలో దుడ్లు చెట్లకు కాస్తుండాయా తల్లీ... నా బతుక్కి మద్దేనం పేసింజరు చాల్దా,' అని తేల్చేశాడు. 'తొలినుంచీ నీదంతా యితండమే...' అని అక్క విసుక్కుంది. నేనెటూ ఖాళీగా ఉన్నాను కాబట్టి మోటారు సైకిలుమీద స్టేషనుకు తీస్కెళ్లాను.

"ఈ ట్రిప్పులో పల్లెకొస్తా మామా... పొలం అమ్మేయాల," అన్నాను.

"కొలు నా కొడుకులు కతలు చెప్తా వుంటే నువు మాత్రం ఏంజేస్తావులే... రా... బానే గిడతందిలే..." అంటూ రైలెక్కేశాడు.

*

వీరామామ చిన్నప్పటినుంచీ నా ఊహకందని మనిషి. చదువంటే బడులూ, తరగతులూ, అవి దాటినట్లుగా సర్టిఫికెట్లు మాత్రం అయితే... వీరామామకు చదువులేదు. చదువంటే అనుభవమూ, జ్ఞానమూ, బతుకులో ఎదురయ్యే కడగండ్లకు ఎదురునిలవగల తెగువా అయితే వీరామామ మహా గొప్ప చదువరి.

వీరామామ ఒంటరి. రెండో కూతుర్ని చేతిలో పెట్టాక అత్త పోయింది. మళ్లీ పెళ్లి జోలికి పోలేదు. ఇద్దర్నీ సాకి సంతరించాడు. కలిగిన కుటుంబాల్లోనే యిచ్చి చేశాడు. ఇరవయ్యెకరాల పొలముంటే... కూతుళ్లకు చెరి తొమ్మిదెకరాలు ఇచ్చి సాగనంపాడు. రెండెకరాలు మాత్రం తన పేర్న పెట్టుకున్నాడు. సొంతంగా సేద్యం చేస్తాడు. కార్యాలకి తప్ప కూతుళ్ల ఇంటి గడప తొక్కడు. ఏడాదికోసారి పుట్టింటికి పిలిచే సాంప్రదాయాలేవీ పాటించడు. నాకున్నదాంట్లో మీకు సమంగా ఇచ్చా... ఇక మిగిలిందాంట్లో మీకు దమ్మిడీ రాదు అనేశాడు. 'కోట్లకుకోట్ల పొలాలు ఎవరియ్యమన్నారూ... పండక్కీ పబ్బానికీ పిలిచి పుట్టింటోళ్లు పసుపుకుంకాలు పెట్టాలనే ముచ్చటుంటాది కదా మాకు,' అని చిన్న వదిన సన్నాయి నొక్కుతుంది గానీ మామ చెవిన వేసుకోడు. ఇవన్నీ అప్పుడప్పుడూ చుట్టాల మాటల్లో మామ గురించి నేను విన్నవి.

ఆయన ముక్కుసూటి మనిషి. ముఖప్రీతి కోసం మాట్లాడడు. ఎవ్వరి విషయాల్లోనూ జోక్యం చేసుకోడు. ఎవ్వరి పెత్తనాన్నీ సహించడు. దేనికీ ఆశపడడు. దేనికీ భయపడడు. ఇవన్నీ మామ గురించి నాకు తెలిసినవి.

సిటీలో పనులు చక్కబెట్టుకుంటూ, బావ వాళ్లింట్లోనే రెండ్రోజులున్నాను.

''పొలం అమ్మేద్దామనుకుంటున్నా పల్లెకెళ్లాలి,'' అంటే, ''ఎందుకురా... ఊళ్లో బ్రోకరు నెంబరుంది నాదగ్గర. పిలుద్దాంలే,'' అంది అక్క.

''అలాక్కాదులే... వీరామామని మొన్న చూశాక చిన్నప్పటి ముచ్చట్లంతా గుర్తొస్తున్నాయి. ఓరోజు ఆయనతో ఉండేసి వొస్తా...'' అన్నాను.

''బానే ఉంది సంబడం ఆయన్తో ఎక్కడుంటావురా,'' అంది.

''మరీ అంతగా అమెరికా సుకాలకి అలవాటు పడలేదులే...'' అనేసరికి, ఏదో చెప్పడానికి నోరు తెరచిందల్లా... అక్క ఆగిపోయింది... బావ సైగను అందుకుని.

*

రేణిగుంటలో విమానం దిగి, తిరుపతి నుంచి ఫ్రెండు పంపిన కార్లో పల్లె చేరుకున్నాను. రచ్చబండ దగ్గరికెళ్లి అడిగితే... వీరామామ గురించి సత్రం దగ్గర వాకబు చేయమన్నారు.

మా ఊళ్లో సత్రం చాలా పెద్దది. ఊరి నుంచి కాస్త ఎడంగా ఉంటుంది. అప్పట్లో రాయలవారు కట్టించారని అంటారు. తిరుమల వెంకటేశ్వరుడికి గరుడ సేవ కోసం శ్రీవిల్లిపుత్తూరు నుంచి ఏటా కాలి నడకన భక్తులు తెచ్చే తిరుఛత్రాలు... గొడుగులు... ఈ దార్లోనే వస్తాయి. అదొక్కటే కాదు, పెరటాశి నెల్లో వేలమంది అరవోళ్లు కాలి నడకన ఏడుకొండలకి వచ్చేది కూడా ఈ దార్లోనే. వాళ్లందరూ విడిది చేసేలాగా కట్టిన విశాలమైన సత్రం. ఇప్పుడు బైపాస్ రోడ్లు వచ్చాక ఈ సత్రానికి విలువ తగ్గింది. ఈమధ్య కాలంలో సత్రం గదుల్లో పంచాయతీ ఆఫీసు నడుపుతూ... వీధివైపు మండపాన్ని మాత్రం జనం కోసం వదిలేశారు. అక్కడ కూర్చుని పేపరు చదువుతున్నాడు వీరామామ.

ముతక గాడాగుడ్డతో కుట్టించిన ఓ నాడాల డ్రాయరు, చంకల కింద రెండు జేబులతో కుట్టించిన బనీను. ఆ అవతారంలో మామను చూస్తే రెండెకరాల రైతులా లేడు. గింజలు తోలడానికి బండికట్టే కూలీలా ఉన్నాడు. కారు ఆగగానే తలెత్తి చూసి... ''రారా అబ్బాయ్,'' అంటూ పక్కన చోటిచ్చాడు. పంచె చుట్టుకుని, చొక్కా తొడుక్కున్నాడు. తుండుగుడ్డ దులిపి భుజం మీద వేసుకున్నాడు.

ఈలోగా, బాబాయి సైకిల్లో సత్రం దగ్గరకొచ్చేశాడు. వీరామామ పక్కన సత్రం అరుగుమీద కూర్చుని ఉన్నాను. రోడ్డు మీదనుంచే సైకిలు దిగకుండా... "మద్దేనం ఇంటికొచ్చేయిరా. చెరువులో చేపలు పట్టారు. బొమ్మిడాయిలు పులుసు పెట్టి, కోడిగుడ్లు యేయిస్తాందాది మీ చినమ్మ," అన్నాడు.

"నేనూ వీరామామా ఇద్దరమూ వొచ్చేస్తాంలే బాబాయ్," అన్నాను.

"వోళ్లు పెద్దోళ్లు. మన కొంపకి ఎందుకొస్తార్లేరా? మద్దేనందాకా వోడితో తిరిగి యేళ మీరిపోకుండా వొచ్చేయ్," అంటా చక్కాపోయాడు బాబాయి.

వీరామామ చిద్విలాసంగా నవ్వుతున్నాడు.

కారెక్కిన తర్వాత... "ఎకరం ఎంత పోతుందో వాకబు చేసుకున్నావా," అడిగాడు.

'ముప్పయికి తక్కువైతే ఒప్పుకోకు... నిరుడు పాతిక పలికింది ఆ పక్కనే,' అంటూ బయల్దేరేముందు అక్క చెప్పింది. నిజానికి ఇప్పుడు పొలం కౌలు చేస్తున్నది మా బాబాయే. అందుకే పంటలు సరిగా లేవని కౌలు ఎగేసినా... గట్టిగా అడగలేక పోతున్నా.

"పక్కపొలం పాతిక లెక్కన అమ్మాంరా... ఆపైన ఒకటి రెండు పెట్టుకుని ఇచ్చేయొచ్చు. ఇష్టమైతే చెప్పు... ఒకేసారి మొత్తం ఇవ్వలేనుగానీ... నేనే తీసు కుంటా..." అన్నాడు బాబాయి.

అవేవీ బయటపడనివ్వకుండా లౌక్యం ప్రదర్శించాను.

"లేదు మామా... అంతా నువ్వు చూసుకుంటావు కదా అని," అన్నాను నర్మగర్భంగా.

నమ్మాడో లేదో తెలియదు... కారెక్కి కూర్చున్నాక, "ఏకాంబరకుప్పం పోనీ," అన్నాడు.

అక్కడ మామ బేరం మాట్లాడినట్లున్నాడు అని అర్థమైంది. ఏదో మామను కలుద్దామని వచ్చానే తప్ప... పాతిక మీద రెండు పెట్టి కొంటానన్న బాబాయికి ఇచ్చేద్దామనే ఉద్దేశంతోనే ఉన్నాన్నేను.

"ఊళ్లోవాళ్లకే ఇస్తే బాగుంటుందనుకున్నా వీరామామా. మన నేల మనోళ్లే చేసుకుంటారు గదా అని," నసిగాను.

"ఏడిశావ్లే," అన్నాడు మామ నవ్వుతూ. "నేల మీద అంత మనసుంటే సేద్యమే జేసుకోవాల... తెగనమ్మదలచినాక... దుడ్డొక్కటే జూసుకోవాల... తనా మనా గాదు..." అన్నాడు.

అందుకే అందరూ ఈయన్ని వితండం మామ అనేది, అనిపించింది.

“ఏకాంబరకుప్పమోళ్లు దుడ్లు దండిగా పెట్టుకోనుండార్రా. ఆ అరవోళ్లకి ఆట్ని యెక్కడ బెట్టాల్నో గూడా తెలీడంలే. తక్కెట్లో దుడ్లు మూటలు బెట్టినా... నేలమ్మే నా కొడుకు లేడిక్కడ. యింకా పెరగతందని చూసేవోళ్లే అంతా. ముందు నాతో రా. రేటు నీకు కిట్టలేదనుకో... నీ యిష్టమొచ్చినోళ్లకి అమ్మేయొచ్చు. ఎటూ మీ బాబాయిక్కూడా కన్నుండాది దానిమీద,” అన్నాడు.

ఈలోగా ఏకాంబరకుప్పం వచ్చింది.

“చెప్పాను కదా సుబ్రమణీ... వీడే నా అల్లుడు. పదెకరాల బిట్టు. బండిబాట ఆనుకునే ఉంటుంది. నీళ్ల దిగుల్లేదు. ఆలోచించుకోనక్కర్లేదు... రేటు నువ్వు మాటాడుకో...” అమ్మదలచుకున్న నేల గుణగణాలు చెబుతున్నాడు మామ.

సదరు సుబ్రమణి చేతులు పిసుక్కుంటూ... మొహాన- బేరమాడ్డానికి సిద్ధమవుతున్న నవ్వు పులుముకుంటూ మొదలెట్టాడు.

“సారూ... మీ మామ అన్నీ చెప్పినారు. నేను పొయ్యి పొలం కూడా చూసి వస్తిని. మీరు తిరిగి అమెరికా పొయ్యేలోగా... సెటిలైపోవాల, అన్నారు. అప్పటికీ నేను ఎకరం నలభైదాకా వొస్తిని సారూ. మీ మామ వూఁ అనలే. మీరే కొంచిం సూసిపోవాల. కోటి రూపాయలు క్యాషుగా ఇస్తును. రిజిస్ట్రేషన్ నాటికి... మిగిలిన మూడు కోట్లూ చెక్కులు ఇస్తును. ముడియాదంటే... మీ మాట సెప్పండి...” అని ఆగాడు.

దిమ్మెరపోయాన్నేను. సిటీలో బావ చెప్పిన ముప్పయి ఎక్కడ, అక్క సూచించిన పాతిక ఎక్కడ, బాబాయి ప్రతిపాదించిన ఇరవయ్యేడు ఎక్కడ... వీరామామ బేరంలో నలభై ఎక్కడ?

“అలాగే కానివ్వండి...” అనేశాను.

సుబ్రమణి నా రెండు చేతులూ పట్టుకుని థాంక్స్ చెప్పేసి... లేచి బీరువా లోంచి ఓ చిన్న బ్యాగు తీసి నా చేతిలో పెడుతూ... “పంచమి... మంచిరోజు సారూ... ఎడ్వాన్సు తీసుకోండి... కోటి రూపాయలు వుండాయి,” అన్నాడు.

“ఎగ్రిమెంటు రెడీ అయిందా...” అన్నాడు వీరామామ, ఆ యాభై కట్టల్ని ఎంచడానికి పూనుకుంటూ.

టేబులు సొరుగులోంచి సుబ్రమణి తీసివ్వడం, నేను చదివి సంతకం చేయడం, ఈలోగా లెక్కింపు పూర్తిచేసిన వీరామామ సాక్షి సంతకం చేయడం అయిపోయాయి.

మామ అందుకుని, “ఏం సుబ్రమణీ... యాపారం చేస్తండావు... పద్ధతి తెలీకుంటే ఎట్టా...? కుండ కడిగి బోర్లించినట్టు సొత్తు మొత్తం ఇచ్చేయకూడదు.

ఇదిగో ఇది లోపలుంచు...'' అని కట్టలోంచి ఓ కాగితం తీసి ఆయన చేతికిచ్చాడు. సుబ్రమణి దాన్ని కళ్లద్దుకుని తిరిగి బీరువాలో పెట్టాడు.

''ఏంది మామా... ఇరవయ్యేడొస్తే చాలనుకున్నా... దాన్ని ఇంత జేశావే,'' అన్నా, తిరిగి కారెక్కాక.

''ఒరేయ్... అమెరికాలో వుండే నీకు విలువ తెలీకపోవచ్చు. సత్రంలో పడుండే సత్రకాయగాణ్ని... నాకు తెలీదా,'' అన్నాడు.

ఈలోగా మామ పొలమొచ్చింది. పనుందని తానక్కడ దిగేశాడు.

''తిన్నాక మళ్లీ సత్రం దగ్గరకు వచ్చేయిరా,'' అంటూ పంచె ఎగ్గట్టి, తుండుగుడ్డ తలకు చుట్టుకుంటూ పొలంగట్టు మీదికెళ్లిపోయాడు.

*

''పులుసు బాగుంది పిన్నీ,'' అన్నాను.

''ఇంకో రెండు బొమ్మిడాయిలేసుకోరా,'' అన్నాడు బాబాయి.

అప్పటికే బాబాయి మొహం మాడిపోయి ఉంది. పిన్ని అంతకంటే తేడాగా ఏంలేదు. ఊళ్లోకి అడుగుపెట్టగానే, బేరం తేల్చేస్తానని ఆయన ఊహించి ఉండకపోవచ్చు. అగ్రిమెంటు కూడా అయిపోయిందనేసరికి దెబ్బతిన్నట్టు చూశాడు. తర్వాత ఆ సంగతి ఎత్తలేదు. కానీ మొహంలో తేడా తెలిసిపోతోంది.

''వీరామామను కూడా పిలిచి ఉండాల్సింది,'' అన్నాను.

''ఊళ్లో అడుగుపెట్టే యోగ్యత పోగొట్టుకున్నాళ్లేరా వితండపు యెదవ,'' అన్నాడు కచ్చిగా.

అర్థం కాలేదు. అడక్కపోయినా... ఆయనే కొనసాగించాడు.

''తొలినుంచి వితండమే యెదవ. వోడికి డబ్బే కావాల. బందాలు అక్కర్లే. ఈ నడమ ఇల్లమ్మితే ముప్పయి అయిదు లక్షలొచ్చాయి. ఒక్కమ్మికి కూడా నయాపైసా ఇయ్యలా. వోళ్లొచ్చి చెరి అయిదు లక్షలడిగారు. యినిపించుకోలా! ఊరోళ్లంతా మద్దిస్తం జేసినారు. ఎవుడి సొమ్ముకు ఎవుడు మద్దిస్తం జేస్తుండార్రా... నేనసలు ఊర్లోనే ఉండనని పొయి సత్రంలో జేరినాడు... ఇట్టాంటి నాయిన, ఉన్నా ఒకటే సచ్చినా ఒకటే అనుకుంటా బిడ్డలు కన్నీళ్లు పెట్టుకుంటా పొయినారు. ఊర్లో అడుగుపెట్టే యోగ్యతలేదు ఎదవకి. మనోళ్లెవరూ పలకరించేది కూడా లే...'' అంటూ ఏమేమో చెప్పాడు బాబాయి.

అందరికీ తలలో నాలుకలా ఉంటూ... అందరివీ తన పనులే అనుకుంటూ బతికే మామ సత్రంలో ఉంటున్నాడా? మరి ఇల్లమ్మిందీ, సేద్యంలో వచ్చేదీ... డబ్బంతా ఏమైనట్టు? ఏం చేస్తున్నట్టు?

చిత్రంగా ఉంది నాకు. నిజంగానే... వీరామామకు ఇంత చెడ్డ పేరుందా? లేదా తాను కొనదలచుకున్న పొలం బేరం చెడగొట్టాడని బాబాయి కల్పించి చెబుతున్నాడా? సిటీలో నన్ను హెచ్చరించిన అక్క కూడా ఈ బాబాయి కూతురే కదా... అని అనుమానమొచ్చింది. ఆలోచనల్తోనే చేయి కడుక్కొని తిరిగి సత్రం దగ్గరికొచ్చాను. మడిచిన తుండుగుడ్డని తలకింద దిండులా పెట్టి పడుకుని... కాలిమీద కాలేసుకుని, అరుగు మీద కునుకు తీస్తున్నాడు వీరామామ. కారు అలికిడికి లేచాడు.

కాసేపు మాటామంతీ అయ్యాక... "ఏంది మామా... బాబాయి ఏదేదో చెప్తన్నాడే నీమీద," అన్నాను.

పెద్దగా నవ్వేసి, "ఊర్లో ఎవుణ్నడిగినా అట్టే జెప్తార్రా... నేను యితండం పట్టినోణ్నిగదా," అన్నాడు.

నేను నవ్వలేదు. "వోళ్లనేది నాకొద్దు మామా... నీ నోటితో ఏం జెప్తావో చెప్పు..." అడిగాను.

నవ్వులోంచి తేరుకున్నాడు మామ. కొంచెం సీరియస్ అయ్యాడు. తుండు గుడ్డతో మొహం తుడుచుకున్నాడు. మొదలెట్టాడు.

"వొరేయ్... మనుషులంటేనే డబ్బులు! డబ్బులుంటేనే... ఇస్తుంటేనే నాయినైనా, అమ్మయినా... అన్నయినా... అక్కయినా... లేపోతే లేదు. బంధాలన్నీ డబ్బులైపోతండాయని కొత్తగా నేను కనిపెట్టి చెప్పబళ్లే. నీకూ తెలీంది కాదు. అందుకే అన్నీ తుంచుకున్నా. నా దారేందో ఎంచుకున్నా. ఒంటికాయ శొంటికొమ్ము గాడికి ఇల్లేంటికని, అమ్మేశా. పొలంమీద గాదు.. సేద్యం మీద మమకారం చావక ఆ రెండెకరాలు పండిస్తన్నా. యేళకి ఏది దొరికితే అది తినడం... సత్రంలో తొంగోడం... బండి దొల్లిపోతండాది," అభావంగా నవ్వాడు.

"వీరామామా... ముప్పయి లక్షలు లెక్కన వొస్తే చాలనుకున్న నాకు... నీ వల్ల కోటి జాస్తిగా వొచ్చింది... ఓ యాభై నువ్వు తీసుకో... స్థిమితంగా ఉండు..." కాస్త మొహమాటంగానే అన్నాను.

మరింత పెద్దగా నవ్వాడు. తొడుక్కున్న గుడ్డ బనీను జేబులో చెయ్యిపెట్టి తీశాడు. కార్డుతో పాటు... వచ్చిన ఏటీఎం స్లిప్ నా చేతికి అందించాడు. అందులో చూశాను. ఆరోజునే వంద రూపాయలు విత్ డ్రా చేశాడు. గుచ్చిగుచ్చి చూశాను. బ్యాలెన్స్ ఇంకా డెబ్బయి ఎనిమిది లక్షల చిల్లర కనిపిస్తోంది. ఆశ్చర్యపోయాను. జాగ్రత్తగా దాన్ని అందుకుని మడిచి మళ్లీ బనీను జేబులో పెట్టుకుని అన్నాడు.

"అందరూ అనేది అబద్ధం కాదురా... నా బతుకు నిజంగానే యితండం. నలుగురూ నడిచే తోవలో గాకుండా పెడసరంగా పోవడం యితండమే. యిదిగో

చూసినావు గదా... ఇల్లమ్మింది... ఇన్నాళ్లుగా ఆ రెండెకరాల్లో సాగుచేస్తున్నదీ... అంతా ఇందులోనే ఉంది. ఇంకా నాకు నీ డబ్బేంటికి రా... నువ్వు నోట్లకట్టలుగా మారిపోయిన మనుషుల్లో మోసమైపోగూడదని సుబ్రమణితో బేరం మాటాడానే గానీ... నీ కమీషను కోసమా...'' అన్నాడు.

''ఛఛ అలా అనకు మామా,'' నిజంగానే నొచ్చుకున్నాను.

''యిదిగో వొరేయ్... యిను... యెవురికీ చెప్పుకొనేది కూడా కాదు. చెప్పినా యినేవోళ్లు గూడా లేరు. నా బతుకు యెట్ట సాగాల్నో నాకో లెక్కుండాది. అమ్మి లిద్దరికీ కోట్ల ఆస్తి యిచ్చి పంపిచ్చినా... వాళ్లకు నా మీద ప్రేమ ఉంటాదనుకున్నా.. కానీ, వాళ్లకి నామీద యింకా ఆశ వుండాది. నరజనమెత్తిన ఎవుడైనా అంతే. పెడితే మంచి గోర్తారు... లేకుంటే చావు గోర్తారు... యీ యావంతా యేటికని, యీడ బతకతన్నా...''

''మరీ ఇక్కడా... తిండీతిప్పలూ ఎలా...''

''చెబితినే. వొచ్చిందంతా బ్యాంకులో యేసినా... యిదిగో...'' బనీను జేబులోని ఏటీఎంకార్డు తడుముతూ చెప్పాడు.

''సొత్తు తాళం యిక్కడుంటాది. రోజూ వంద రూపాయలు తీస్తా. రోజుకు వంద మించి పైసా కూడా కర్చు పెట్టను. ఆ వందతో రోజంతా పళ్లు తింటా, మజ్జిగో పళ్లరసాలో తాగతా. పొలంలో బోరుకాడ స్నానం చేస్తా. రోగం రొష్టూ లేవు. వుండేదంతా ఈ పంచె, చొక్కా, తుండుగుడ్డా...! ప్రతిరోజూ పొద్దన్నే పొలం బోరుకాడ ఉతికి ఆరేసుకుని... ఆనక తొడుక్కుని, డ్రాయరూ బనీనూ ఉతుక్కుంటా...! పొద్దంతా పొలం కాడే ఉంటా... పొద్దుగుంకేక సత్రంలోకొస్తా... తెల్లారాక మళ్లీ వంద తీస్తా.''

ధారాళంగా చెప్పుకుంటూ పోతున్నాడు. ఇతడు ఈ ప్రపంచంలో మనిషేనా? ఒక మనిషి ఇలాకూడా బతుకుతాడా... అని నివ్వెరపోతూ వింటున్నాను.

''మరి ఈ డబ్బంతా...'' అడిగాను.

''నువ్వు డబ్బు సంగతి అడుగుతున్నావు... నేను చస్తే కట్టె సంగతేంది? అన్నీ ఏర్పాటు జేసేశా... ప్రతిరోజూ వందతోగూడా చీటీ తీసేది అందుకే... ఉన్న పళంగా చస్తే బ్యాంకీలో ఎంతుండాదో... చూసినోళ్లకి లెక్క తెలీడానికి. చావగానే ఈ దేహంలో పనికొచ్చేటివన్నీ కోసి తీస్కోడానికి తిరపతి రుయా ఆస్పత్రోళ్లకి రాసిచ్చినా. ఆనక మిగిలిన శరీరం కోసి చూస్కోడానికి మెడికల్ కాలేజీవోళ్లకి రాసిచ్చినా... యిక నా బ్యాంకులో సొత్తంటావా...'' కాస్త ఊపిరి పీల్చుకుని మళ్లీ అన్నాడు.

“నా అకౌంటుకి... ” వాయవ్యంగా చెయ్యెత్తి చూపించి... “కడుపున పుట్టని వారసుడు ఆ కొండమీద పెద్దాయనే... అట్టాగని విల్లు రాసేసినా... యింక నాకేం గావాల?

“యేం కావాలని ఆసె పడాల?
“యేం బావుకున్నామని మిడిసి పడాల?
“యేం వుండాదని జాగర్తపడాల?
“యేం పోతందని బయపడాల?
... ... ...”

వీరామామ ఇంకా ఏదో చెప్పాడు. కానీ... ఆ తర్వాత ఏమీ నా చెవుల్లోకి వెళ్లలేదు. ప్రపంచంలో మనమంతా దేవుడికి బిడ్డలం అని అనుకుంటాం. ఎంత వితండం కాకపోతే, ఆ దేవుడినే తన బిడ్డను చేసుకుంటాడు వీరామామ!

వీరామామని ప్రపంచం అర్థంచేసుకోవాలా? ప్రపంచాన్ని వీరామామ అర్థం చేసుకోవాలా? ఈ ప్రపంచపు మనిషిని కాను నేను! ఇక్కడివని మీరనుకునే పద్ధతులూ, బతుకుతీరూ ఏదీ నన్ను అంటదు... అన్నట్టుగా బతికే ఈ మనిషికి తెరువేది?


పొద్దు వాలి, సూర్యుడు కుంగిపోతున్నాడు. మామ మాటలు, నాలోకి యింకిపోతున్నాయి.

తమోపహయైన దీపంలాగా, సంజెవెలుగులో ఎర్రగా మెరుస్తున్న మామను వాటేసుకుని, వదిలి, కారెక్కాను.

మామ చెయ్యి ఊపి టాటా చెబుతున్నాడు.

*ఆంధ్రజ్యోతి ఆదివారం*
*17 జనవరి 2021*

*



13 డిసెంబర్ 1972న చిత్తూరు జిల్లాలో పుట్టిన కె.ఎ. మునిసురేష్ పిళ్లై మొదటి కథ ఆదర్శిని పత్రికలో అచ్చయింది. 100కు పైగా కథలు రాశారు. రెండు కథాసంపుటాలు- *పూర్ణమూ నిరంతరమూ*, *రాతి తయారి*; ఒక నవల ప్రచురించారు. *సదాస్మరామి*, *గురు శిఖరం* పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. జర్నలిజం వృత్తిలో ప్రస్తుతం ఫ్రీలాన్సర్‌గా ఉన్నారు.

**చిరునామా:** **ఫ్లాట్ నెం. 501, అన్నమయ్య రెసిడెన్సీ, రోడ్ నెం. 38**
**అయ్యప్ప సొసైటీ, మాధాపూర్, హైదరాబాద్-500 081.**
***ఫోన్: 99594 88088*** **kamspillai@gmail.com**